గాడితప్పిన అంగన్‌వాడీ!

- పలుచోట్ల టీచర్లు, ఆయా పోస్టులు ఖాళీ
- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సరిగా అందని పౌష్టికాహారం
- పూర్వప్రాథమిక విద్యకు దూరమవుతున్న పిల్లలు



మిర్యాలగూడ మండలం ఎర్రావులపాడులో టీచరు, ఆయా లేకపోవడంతో తాళం తీయని అంగన్‌వాడీ కేంద్రం

మిర్యాలగూడ టౌన్: జిల్లాలోని కొన్నిచోట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, ఆయా పోస్టులు భర్తీ కాకుండా ఖాళీగా ఉండడంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ లక్ష్యం నెరవేరడం లేదు. టీచర్లు ఉన్నచోట ఆయాలు లేకపోవడంతో టీచర్లపైనే పనిభారం పడుతోంది. నిత్యం వారు పోషణ ట్రాకర్లలో పిల్లల వివరాలను ఆన్‌లైన్ చేయడం, చదువు చెప్పడం, వంటలు చేసి భోజనం వడ్డించడంతోపాటు అందరినీ చూసుకోవడం సమస్యగా మారుతోంది. ఆయాలు ఉన్నచోట టీచర్ల పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల చిన్నారులకు చదువు చెప్పేవారు కరువయ్యారు.

జిల్లాలో తొమ్మిది ప్రాజెక్టులు

నల్లగొండ జిల్లాలో అనుముల, చింతపల్లి, దామరచర్ల, కొండమల్లేపల్లి, దేవరకొండ, మునుగోడు, మిర్యాలగూడ, నకిరేకల్, నల్లగొండ తొమ్మిది ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఒక ఆయా, ఒక టీచరు ఉండాలి. ప్రస్తుతం ఇందులో కొంతమంది పదోన్నతులు పొందగా మరికొందరు రిటైర్మెంట్ కావడం తదితర కారణాలతో 159 టీచర్లు, 641 ఆయాల పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాలు	2,093
చిన్నారుల సంఖ్య	85,788
గర్భిణులు	8471
బాలింతలు	8418
ఖాళీ పోస్టులు	
టీచర్లు 159	ఆయాలు 641

చదువుకు చిన్నారులు దూరం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో చిన్నారుల ఆటాపాటలు, పూర్వ ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారు. టీచర్లు లేనిచోట ఆయాలు పిల్లలకు భోజనం వడ్డించి ఇంటికి పంపించడం తప్ప బోధన అందని ద్రాక్షగా మారింది. అయితే రోజూ యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉండగా ఆయాలకు సరైనా అవగాహన లేక నిర్వహణ పూర్తిగా గాడితప్పింది. ఖాళీగా ఉన్న కేంద్రాల్లో మరో టీచర్‌కు అదనపు బాధ్యతలను ఇచ్చినా ఫలితం లేకుండా పోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఖాళీలను భర్తీ చేస్తే..అంగన్‌వాడీలు గాడిలో పడతాయని పలువురు అంటున్నారు.

ఉత్తర్వులు రాగానే ఖాళీలు భర్తీచేస్తాం



"అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయా పోస్టుల ఖాళీలపై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. పలు కేంద్రాల్లో టీచర్లు లేనిచోట ఇన్‌చార్జ్‌లను నియమించాం. ఉన్న టీచర్లతోనే కేంద్రాలను ముందుకు తీసుకెళ్తున్నాం. ప్రభుత్వం ఉత్తర్వులు రాగానే ఖాళీలను భర్తీ చేస్తాం.

– కృష్ణవేణి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ: ఆడపిల్లలకు ఎదురవుతున్న సమస్యలను ధైర్యగా ఎదుర్కోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మిర్యాలగూడలోని రైతు వేదికలో నిర్వహించిన బేటి బచావో–బేటి పడావో కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కిశోర బాలికలు రుతుక్రమం సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, వ్యక్తిగత పరిశుభ్రత వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ కృష్ణవేణి, సీడీపీఓ మమత, బీఆర్‌బీ కోఆర్డినేటర్ హరిత, తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీఓ శేషగిరిశర్మ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీతావాణి, సుచరిత, గీత, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

వేసవిలో మిర్యాలగూడ మండలంలో మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో తాగునీటి ఎద్దడిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో 46 గ్రామ పంచాయతీలు, 54 ఆవాస గ్రామాల్లో 18,124 ఇళ్లు, 68,379 మంది జనాభా ఉందని, ప్రతి ఒక్కరికి రోజుకు వంద లీటర్ల చొప్పున 68,36,900 లీటర్ల నీరు అవసరం ఉందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇంటింటికి నల్లా బిగించామని, ప్రతిరోజు నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపరిచి రోజూ నీరు అందేలా చూడాలన్నారు. నీటి ఎద్దడిగా ఉన్న గ్రామాల్లో అద్దె బోర్ల ద్వారా అందించాలన్నారు.

క్లుప్తంగా

రైతు భరోసా ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గల రైతు వేదికలో రైతు భరోసా ఫిర్యాదుల కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ధీరావత్ సైదానాయక్ తెలిపారు. బుధవారం రైతు వేదికలో రైతు భరోసాపై ఆయన ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓలు రమ్య, షఫీ, రమేష్ ఉన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ

అడవిదేవులపల్లి : రైతు భరోసా పథకం కింద నగదు జమ కాని రైతులు వ్యవసాయ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్‌లో దరఖాస్తు అందజేయాలని మండల వ్యవసాయ అధికారిని గుర్రం సరిత తెలిపారు. బుధవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు భరోసా పథకానికి సంబంధించిన పలు ఫిర్యాదులను రైతుల నుంచి స్వీకరించి మాట్లాడారు. రైతు భరోసా పథకంపై సందేహాలు ఉంటే ఏఈఓల ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రావుల సురేష్ తదితరులు ఉన్నారు.

మాథ్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ చీదళ్ల వెంకట్

మిర్యాలగూడ: శ్రీనివాస రామానుజన్ మాథ్స్ ఒలింపియాడ్ ఫలితాల్లో మిర్యాలగూడ పట్టణంలోని కాకతీయ పాఠశాల విద్యార్థులు ప్రతిభ సాధించారు. రాష్ట్ర స్థాయిలో నంద్యాల సాత్విక్‌రెడ్డి రెండవ 2వ ర్యాంకు, నల్ల సాయి 4వ ర్యాంకు, కట్టా వెంకటేశ్వర్‌రెడ్డి, గార్లపాటి శ్రీకర్‌రెడ్డి, ఉబ్బపల్లి మహేష్‌లు జిల్లా ఫస్ట్ ర్యాంకు, గుండ్ల హర్షవర్ధన్‌రెడ్డి, కె.విహార్ జిల్లా స్థాయిలో సెకండ్ ర్యాంకు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ చీదళ్ల వెంకట్ తెలిపారు. విద్యార్థులను బుధవారం పాఠశాలలో అభినందించారు.

ఏరియా ఆస్పత్రిలో పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ హరిబాబు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండల తహసీల్దార్ హరిబాబు కుమార్తె స్నికిత పుట్టిన రోజు పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో దామరచర్ల, మాడుగులపల్లి తహసీల్దార్లు జవహర్‌లాల్, సురేష్‌కుమార్, ఎంఈఓ బాలాజీ నాయక్, ఆర్‌ఐలు బాణావత్ సత్యనారాయణ, ఠాగూర్ రామకృష్ణ, సతీష్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు లింగయ్య, బి.ఎం నాయుడు, పరమేష్, ఏచూరి మురాహరి, భాగ్యలక్ష్మి, రాంబాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సుపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం



దుగ్గెపల్లి ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ బాక్స్‌లు అందజేస్తున్న దాతలు

త్రిపురారం : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల అందిస్తున్న సహకారం అభినందనీయమని హెచ్‌ఎం బాబురావు అన్నారు. బుధవారం మండలంలోని దుగ్గెపల్లి గ్రామానికి చెందిన పరిక నాగభూషణం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.25వేలు విలువ గల మైకు, సౌండ్‌బాక్స్‌లు పాఠశాల హెచ్‌ఎంకు అందజేశారు. కార్యక్రమంలో దశరథ, కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భాస్కర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

మిర్యాలగూడ : మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుపై కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని దామరచర్ల మండల బీఆర్‌ఎస్ నాయకుడు రమావత్ వినోద్‌నాయక్ అన్నారు. బుధవారం దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే కేసీఆర్ దామరచర్లలో యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మించారన్న విషయం కాంగ్రెస్ నాయకులు మరిచిపోయారని అన్నారు. భాస్కర్‌రావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మిర్యాలగూడ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని, అంబేద్కర్, పూలే భవనాలను నిర్మించారని గుర్తుచేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావుపై అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా : అనుముల మండలంలోని పేరూర్‌లో గల శ్రీస్వయంభూ సోమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26నుంచి మార్చి 1వతేదీ వరకు మహాశివరాత్రి వేడుకలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలో ఏర్పాటు కార్యక్రమంలో మహాశివరాత్రి వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, పార్కింగ్‌కు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని, భక్తులందరికీ సులభంగా దర్శనమయ్యేలా చూడాలని ఆలయ కమిటీకి సూచించారు. కార్యక్రమంలో హాలియా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, పేరూర్ శివాలయం చైర్మన్ రిక్కల కొండారెడ్డి, హాలియా మార్కెట్ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు గౌనీ రాజారమేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు చెన్నబోయిన శ్రీనయ్య, దుండిగల పెద్ద నర్సింహ, యడవెల్లి సునిత, జానపాటి వెంకన్న, యడవెల్లి రాంబాబు, కొండోజు సైదాచారి, పాండునాయక్, రాకేష్‌శర్మ తదితరులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను పునఃసమీక్షించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, అన్నిరంగాలకు ప్రాధాన్యత ఇచ్చేలా కేంద్ర బడ్జెట్‌ను పునః సమీక్షించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మిర్యాలగూడలోని అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్‌చంద్ర, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, పాదూరి శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, రొండి శ్రీనివాస్, అయూబ్, రాంరెడ్డి, కోటిరెడ్డి, దేశిరాంనాయక్, ఊర్మిల, దయానంద్, వెంకట్‌రెడ్డి, మట్టారెడ్డి, రామారావు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

వేములపల్లి(మాడ్గులపల్లి) : కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ మాడ్గులపల్లి మండల కేంద్రంలో బుధవారం సీపీఎం నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ రైతులకు, కూలీలకు, మహిళలకు, కార్మికులకు వ్యతిరేకంగా ఉందని, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని ఆరోపించారు. కేంద్రం బడ్జెట్‌ను వెంటనే సవరించి అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అయితగాని విష్ణు, తంగెళ్ల నాగమణి, చింతచర్ల శ్రీను, పిండి వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాములు, వెంకట్‌రెడ్డి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్



సమావేశంలో పాల్గొన్న పద్మశాలీలు

దేవరకొండ: పద్మశాలి సంఘం దేవరకొండ పట్టణ అధ్యక్షుడిగా ఉప్పల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. బుధరం హైద్రాబాద్‌లోని పద్మశాలి భవన్‌లో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పద్మశాలి సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మాశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, వనం దుశ్యాంతల, రూప, కృష్ణయ్య, చంద్ర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్‌కాలనీ ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజా ప్రతినిధులుగా, ఉన్నతాధికారులుగా వ్యవహరించి ఒక్క రోజు బాధ్యతను నిర్వర్తించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జయమ్మ, ఉపాధ్యాయులు జెస్సికా, సహదేవి, ప్రసన్న, నిర్మల, వనజ, చైతన్య, హనుమకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్లు ఎంపిక

హాలియా : వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 20నుంచి 23వతేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నల్లగొండ జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.భూలోకరావు, జి.కర్తయ్య బుధవారం తెలిపారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపికైన జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల జట్టు వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. జిల్లా సబ్ జూనియర్ బాలికల జట్టుకు ఎంపికైన వారిలో ఎండీ అఫ్సా అలీనగర్, వీ.సాయి అభాగ్న తిరుమలగిరి, సంతోషి నల్లగొండ, మల్లేశ్వరీ చింతపల్లి, ఉద్దవన దేవరకొండ, చందన పీకే మల్లెపల్లి, అనూత్న, హాలియా, సిరివెన్నెల అనుముల, జగ్నిష, ఉట్లపల్లి, వర్షిత వెల్మగూడెం, నిహారిక పులిచర్ల, అక్షయ యాదగారిపల్లి, కోచ్ పరమేష్, మేనేజర్ ఎస్‌కె అయోషాలు వ్యవహరించనున్నట్లు తెలిపారు. అదే విధంగా సబ్ జూనియర్ బాలుర కబడ్డీ జట్టుకు ఎంపికైన వారిలో కార్తీక్ అనుముల, కార్తీక్ కురిమేడ్, పవన్ హాలియా, నితిన్ చెరుకుపల్లి, కార్తీక్ అనుముల, శివ కురిమేడు, రవి కురిమేడు, శివ బసిరెడ్డిపల్లి, మనోజ్ నాగార్జునపేట, దేవరాజ్ బీసీస్కూల్ సాగర్, మణికంఠ ఇబ్రహీంపేట, నిఖిల్ చెరుకుపల్లి కోచ్‌గా రాము, మేనేజర్‌గా చంద్రశేఖర్‌లు వ్యవహరించనున్నట్లు తెలిపారు.

గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

త్రిపురారం : గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని, మత్తు పదార్థాల వినియోగాన్ని నివారించడం ప్రతిఒక్కరి బాధ్యత అని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మలికంటి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం నిడమనూరు మండలంలోని ముకుందాపురం గ్రామంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులతో కలిసి సే నో డ్రగ్ అనే నినాదంతో కూడిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వాడకాన్ని అరికట్టడానికి జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో యువతను చైతన్యపరుస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, డీవైఎఫ్‌ఐ నాయకులు లెంకల పరిపూర్ణచారి, మైలారపు వెంకటయ్య, బొడ్డుపల్లి శ్రీనివాస్, చిలక పురుషోత్తంరెడ్డి, పలాస రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



మిర్యాలగూడ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూవాహిని, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకులు



హాలియా: శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



దేవరకొండ: శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



నాగార్జునసాగర్‌లో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పెద్దవూర : పులిచర్లలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



కొండమల్లేపల్లి : శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రామ్మూర్తి



అడవిదేవులపల్లి : శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హిందూవాహిని కార్యకర్తలు

మిర్చికి మద్దతు ధర రూ.25వేలు ప్రకటించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



దామరచర్ల మండలం కల్లెపల్లి గ్రామంలో మిర్చి పంటను పరిశీలిస్తున్న జూలకంటి

మిర్యాలగూడ: మిర్చి పంటకు ప్రభుత్వం మద్దతు ధర రూ.25వేలు ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం దామరచర్ల మండలం కల్లెపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిర్చి పంటను పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి పంటకు మద్దతు ప్రకటించకుండా రైతులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. గతేడాది మిర్చి పంట క్వింటాకు రూ.25వేలు పలుకగా ఈ సంవత్సరం రూ.12వేలకు తగ్గించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు మిర్చికి క్వింటాకు రూ.15వేలు ఇవ్వాలన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాక మిర్చి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, వినోద్‌నాయక్, ఎర్రనాయక్, దయానంద్, రైతులు మాలునాయక్, సైదా, సక్కు, మంగ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పూజలు చేస్తున్న భక్తులు

హాలియా : పట్టణంలోని స్వయంభూ శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా బ్రహ్మశ్రీ నంది వెలుగు శ్రీబాలాజీ గురుకల్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, హనుమత్ వ్రతం, అంకురార్పణ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మేడిపల్లి మోహన్‌రావు, ప్రముఖ వ్యాపారవేత్త చిట్టిపోలు యాదగిరి, నాయకులు కాకునూరి నారాయణగౌడ్, మలిగిరెడ్డి లింగారెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, ఆలయ కమిటీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కోశాధికారి రేపాల వెంకన్న, పేలపూడి బాలకృష్ణ, వీరమళ్ల శ్రీనివాస్, గౌనీ రాజా రమేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం



మౌనం పాటిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

మిర్యాలగూడ టౌన్ : హైకోర్టులోని 21వ బెంచ్‌లో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ సీనియర్ న్యాయవాది పసునూరి వేణుగోపాల్‌రావు మంగళవారం తన వాదనను వినిపిస్తుండగా గుండెపోటుతో మృతి చెందారు. న్యాయవాది మృతి పట్ల బుధవారం స్థానిక కోర్టులో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వేణుగోపాల్‌రావు అకాల మృతి బార్ అసోసియేషన్‌కు తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.వేణు, సీనియర్ సివిల్ జడ్జి సుజయ్, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సుమబాల, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సకినాల వేలాద్రి, సీనియర్ న్యాయవాదులు ప్రతాప్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, బి.చంద్రశేఖర్‌రెడ్డి, వై.చంద్రశేఖర్‌రెడ్డి, లింగంపల్లి అంజయ్య, రఘురామారావు, జూనియర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


స్నేహితురాలి కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

వేములపల్లి : తనతో పాటు చదువుతున్న తోటి విద్యార్థిని మృతి చెందడంతో విద్యార్థులు బాధిత కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. వేములపల్లి మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన ఈశ్వరి గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. మిర్యాలగూడ పట్టణంలోని అభ్యాస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఈశ్వరి చదువుతుండడంతో తోటి విద్యార్థులు బుధవారం రూ.10 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. పాఠశాల చైర్మన్ వంగాల పుష్పలతనిరంజన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలి



గుడిపల్లిలో సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో అధికారులు, గిరిజనులు

పెద్దఅడిశర్లపల్లి: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలని తహసీల్దార్ మధుహాసిని, ఎంపీడీఓ పద్మ అన్నారు. బుధవారం గుడిపల్లి మండల కేంద్రంలో మండల బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలలకు వారు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బంజారా సేవా సంఘం కొర్ర బాలకృష్ణ, రమావత్ శ్రీను, శంకర్‌నాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా కంపచెట్ల తొలగింపు

వేములపల్లి : మండల కేంద్రంలోని చిన్నచెరువు కట్టను ఇరువైపులా కంపచెట్లు కమ్మేశాయి. దీంతో వేములపల్లి, రావువారిగూడెం గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడుతుండడంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి తన సొంత ఖర్చులతో బుధవారం జేసీబీతో కట్ట వెంట ఉన్న కంపచెట్లను తొలగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాలి కాంతారెడ్డిని అభినందించారు. మత్స్య సహకార సంఘం చైర్మన్ పందిరి శ్రీనివాస్, పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు తంగెళ్ల సత్తిరెడ్డి, కొమ్ము వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అడవిదేవులపల్లి : మండలంలోని కొత్తనందికొండ సబ్ స్టేషన్ పరిధిలో ఫోర్ ఫోల్ స్ట్రక్చర్ ఏర్పాటు చేసేందుకు గాను గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ ఎల్.శ్రీను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తనందికొండ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తనందికొండ, బాల్నేపల్లి, చిట్యాల, మొల్కచర్ల, బంగారికుంటతండా, చింతచెట్టుతండాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.